# ★ జీవనోపాధి ★

రచన : శ్రీ కాళ్ళ గోవిందరావు

★

అప్పుడే కాఫీత్రాగి హోటల్‌నుంచి బయటపడిన సుందరం మిఠాకిళ్ళీనొకటి నోటికందించి సిగరెట్ వెలిగించి తృప్తిగా ఒక పీల్చు పీల్చి, ఆ పొగను వలయాల్లా పైకి వదులుతూ, సందడిగావున్న బజారును పరికిస్తున్నాడు.

సాయంత్రం అవటంవలన బజారంతా చాలా రద్దీగా, మనుషులు ఎవరిపనులువారు పూర్తిచేసుకుని ఇళ్ళు చేరుకోవాలనే తాపత్రయం ఆతురత వారివారి ముఖాల్లో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది!

ఈ మనుషులకన్నా సందడిగా ఇంకా తొందరగా రణ-గొణ ధ్వనులు చేసుకుంటూ జనసమూహాన్ని వేరుపరుస్తూ, హెచ్చరిక చేస్తూ వాహనాలు పరుగెడుతున్నాయ్!

ఎవరెవరు, ఏదేది ఎటుపోయినా, ఏమైపోయినా నేనుమాత్రం యిక్కడనుంచి కదలను సుమా అన్నట్టుగా మైలురాయిలా కూడలి మధ్యనున్న పోలీసు చేతులు వూపుతూ, విజిల్ వూదుతూ తంటాలుపడుతున్నాడు ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ.

అదంతా చూస్తూ నిల్చున్న సుందరం చేతిలోని సిగరెట్ పూర్తిగా కాలిపోవటం, సుందరం దాన్ని విసిరివేయటం జరిగిపోయింది.

"అయ్యా! బాబూ! ధరమప్రభువులు, ఈ గుడ్డోడికి, పనివాడికి మీకు కలిగింది ధరమంసేయండి బాబూ! ఆ దేవుడు మిమ్మల్ని సల్లగా సూస్తాడు..." ఒక వయసు మళ్ళిన స్త్రీ, నరహీనస్థితికి ప్రతిరూపంలా వున్నామె చంకలో సుమారు నాలుగేళ్ళయినా నిండని ఒక పత్రవాడు ఒక చేతిని ముందుకి చాపుతూ, మాటిమాటికీ, డబ్బు వెయ్యండిసుమా అన్నట్టుగా చేతిని వూపుతున్నాడు.

ఆ ముష్టివాళ్ళిద్దర్నీ చూసిన సుందరం దృష్టి ఆ పనివాని నేత్రద్వయం మీదకి మళ్ళాయి! నల్లగా కమిలిపోయి, లోతుగా రెండు గుంటల్లా కనిపిస్తున్నాయి! సుందరం మనసు ఆ దృశ్యాన్ని చూసేసరికి మనస్సు ద్రవించుకుపోయింది. "భగవంతుడా ఆ పసివాడు నీకే అపకారం చేసాడని ఈ స్థితిని కల్పించావ్? నిజంగా నువు కసాయివాడి సుమా!" ఆ సమయంలో భగవంతుణ్ణి నిందించి నిష్ఠూరంగా అనుకున్నాడు సుందరం!

కుర్రాడి చేతిలో పెట్టిన అర్ధరూపాయి నాణేన్ని చూసిన ఆ స్త్రీకళ్ళు ఆశగా మెరిశాయి. తృప్తిగా కృతజ్ఞతా పూర్వకంగా ఆమె సుందరంని ఆశీర్వదిస్తూ, ఆనందంగా ముందికిపోయింది ఆ ముష్టిది.

వారిద్దరూ వెళ్ళినవైపే చూస్తున్న సుందరం మనసు పరిపరి విధాలా ఆలోచించసాగింది. ఆ పిల్లాడి పట్ల భగవంతుడు ఎందుకింత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించాడో అర్థం కావడంలేదు సుందరంకి. అలాగే బరువెక్కిన హృదయంతో, భారంగా అడుగులు వేస్తూ తన లాడ్జ్ చేరుకుని తలుపులు వేసి మనసంతా చికాగ్గా వుండి ఆరోజే తనకువచ్చిన "కథాంజలి" తీసి పేజీలు తిరగవెయ్యసాగాడు. కిటికీగుండా చల్లని గాలి వీస్తోంది. దూరంగా రోడ్డుమీది విద్యుద్దీపాలు మసక మసకగా వెలుగుతున్నాయి కిటికీగుండా.

"ఇదిగో ఈరయ్యా, నీకొడుకు, ఇదిగో ఈరోజు వాడికి ఇవ్వవలసిన అద్దె డబ్బులు..." ఎక్కడో విన్న గొంతుకలా వినిపించేసరికి సుందరం పుస్తకాన్ని టేబిల్ మీద పెట్టి గజగబా అవతలికి వెళ్ళి కిటికీ ప్రక్కగా చూచాడు.

ఆ సాయంత్రం కనపడిన ముష్టిది, ఆ గుడ్డిపిలాడిని ఒక ముసలాయనకి ఇస్తూ, డబ్బుల్ని ఆ ముసలాడి చేతులో పడేసి, మిగిలిన డబ్బుల్ని లెక్కించుకుంటూ ఆమె వెళ్ళిపోయింది.

ఆ ముష్టిది ఇచ్చిన అద్దె డబ్బుల్ని లెక్కచూసుకుంటూ ఆ పిల్లాడిని భుజానవేసుకుని వడివడిగా ముందుకిపోతున్న ఆ వృద్ధుణ్ణి, జీవనవ్యాపారానికి పనికొచ్చిన ఆ అద్దెకుర్రాడిని చూస్తూ బొమ్మలా నిల్చుండి పోయాడు సుందరం.

అనవసరంగా తెలియక తొందరపడి ఆ దేవుణ్ణి నిందించిన సుందరం తన తొందరపాటుకి మనసులోనే చెంపవేసుకున్నాడు.

